నాథ వారికి చరిత్రమీద చెప్పలేనంత కోపం. ఎందుకంటే అది ఆయన కోరుతున్నట్టు వెనక్కి నడవకంలేదు. తన సహజ గుణాన్నిబట్టి ముందుకు పోతోంది.ఇదే అయనకి నచ్చనిది ఇక ఇది పనికాదనుకుని గత చరిత్రమీద విరుచుకు పడ్డారు. చేతిలో పనికనక, దాన్ని తమ ఇష్టం వచ్చినట్టు, తమ నమ్మకాల ప్రకారం తిరగ రాసేస్తున్నారు. చరిత్రకు సంబంధించినంత వరకు ఆయన కల్పనాశక్తికి జోహారనక తప్పదు.

విశ్వనాథ వారిలో సర్వాంటెజ్ గ్రంథంలోని హీరో లక్షణాలుకూడా కనిపిస్తాయి. వర్ణాశ్రమాలతో, రాజరికంతో విలసిల్లిన పూర్వకాలం ఆయన దృష్టిలో స్వర్ణయుగంలా భాసిస్తుంది. సగం ఆ యుగంలోనే జీవిస్తారు. దాన్ని భ్రష్టంచేస్తున్న గాలిమరలను రాక్షసులుగా భావించుకుని కలందూసి చీల్చి చెండాడుతారు. ఆయన దృష్టిలో ఆయన వేదాలను పునరుద్ధరిస్తున్న అపర మత్స్యావతారం.

ఒకటిమాత్రం ఒప్పుకొనక తప్పదు. వ్యుత్పత్తిలోగాని, ఉత్పత్తిలో గాని ఆయన్ని మించగలవారు తెలుగు దేశంలో కొల్లలుగా లేరు అంతేకాదు; ఆయన కొన్ని మంచి రచనలుకూడా చేయకపోలేదు. బండెడు పుస్తకాలు వ్రాసినతరువాత వాటిలో కొన్ని మంచివి, గొప్పవి వుండకుండాపోవు. అవి కూడా, ఎప్పుడో తమ చిన్నతనంలో, తమ నీడనుచూసి తమ అసలు పరిమాణంగా భ్రమించనిరోజులలో వ్రాసినవి. ఏకవీర వంటి నవల, అనార్కలీ వంటి నాటకం, కిన్నెరసాని పాటలు వంటి గేయం, శశిదూతం, ఋతుసంహారం, శృంగారవీధి వంటి కావ్యాలు వారి మనీషకు తార్కాణాలు;ఏనాటికీ శిరోధార్యాలు. ఆ తరవాత వ్రాసిన వాటిలో ఆయన శక్తికంటె వ్యక్తి ఎక్కువగాభాసించింది. ఆయన భావుకత్వపు జీవన్నది మృత సిద్ధాంతాల ఎడారిలో ఇంకిపోవడం తెలుగు సాహిత్యంలోని గొప్ప ట్రాజెడీలలో ఒకటి. ఆయన అవిచ్ఛిన్నంగా కొనసాగించిన రచనా వ్యవసాయం పురాణ వైర గ్రంథాలవంటి పిచ్చిమొక్కలలో పర్యవసించడం ఒక ట్రాజీ-కామెడీ. వాటినిసాధ్యమైనంత త్వరగా మనం మరచిపోయినా తెలుగు వాఙ్మయానికి వాటిల్లే ప్రమాదం లేదు.

త్వరలో తమ సప్తతితమ జన్మదినోత్సవం జరుపుకోనున్న విశ్వనాథ వారికివే నా శుభాకాంక్షలు.

—సవ్యసాచి



రావి కొండలరావు



కంగారూ కన కంగారూ

కనకంగారు గుమ్మం దిగేటప్పటికే కాస్త జల్లు ఆరంభించింది. ఐనా, ఆయన 'ఇదేంచేస్తుందిలే' అని చప్పరించేసి కాలు సారించసాగాడు.కాస్సేపటికి జల్లు వానగా మారింది. పరధ్యానంగా వున్న కనకంగారు ఎడం చెయ్యి పైకెత్తి కుడిచేత్తో గొడుగు తెరవబోయారు. చేతిలో గొడుగు లేదన్న సంగతి మరుక్షణంలో గాని ఆయనకు అర్థంకాలేదు,

ఇదే నా భార్య దగ్గరవున్న అవస్థ. వాన వచ్చేట్టుంది- గొడుగివ్వమన్నానా- అంతలోనే మరిచిపోయింది అని గట్టిగానే అన్నాడు—పేరుకు స్వగతమే ఐనా. వాన గోలలో ఆ మాటలు ఎవరికీ వినిపించలేదు. ఎదురుగా కారు వస్తున్నట్టు 'కారు కూత' వల్ల తెలుసుకుని—ఒకక్షణం ఆయన రోడ్డుపక్కగా ఆగాడు. ఆ ఆగటంలో చొక్కావేపు చూసుకున్నాడు. అది పూర్తిగా తడిసిపోయింది. పంచె జీరాడుతూ కిందన అంతా బురద కొట్టుకుంది. కనకంగారు "హుఁ" అన్నాడు - వానమీదా, రోడ్డుమీదా, భార్యమీదా, బురదమీదా అన్నింటిమీదా కలిసొచ్చేట్టు. ఇహ

లాభంలేదని, పక్కనే ఉన్న అరుగు ఎక్కి నించున్నాడు.

కనకంగారి ఆలోచనంతా తన భార్యమీదకు మళ్ళింది. దానికి మతిమరుపు ఎక్కువయిపోయింది. ఎంతమంది డాక్టర్లకు చూపించినా ఫలితం కనిపించలేదు. దీనితో తాను వేగలేకపోతున్నాడు. వంటపొయ్యిమీద ట్రంకుపెట్టె పెట్టింది మొన్న. 'అదేమిటి అంటే- 'అన్నం గిన్నెకాదూ' అని అడిగింది. స్నానం చేస్తూ చేస్తూ బయటకు వచ్చేసి అట్లాగ వీథిలోకి బయల్దేరబోతుంది. పౌడరుడబ్బాతో తలదువ్వుకుంటుంది - దువ్వెనతో ఒళ్ళురుద్దుకుంటుంది- సబ్బుతో వంట చేస్తుంది! ఒక్కొక్కప్పుడు తననే గుర్తుపట్టదు. 'నేనేనే' అంటూ తను ఎంతదగ్గరగా కనిపించినా 'ఎవరు?' అని అడుగుతుంది. అర్థం లేని ఈ మతిమరపుతనానికి ఏం చెయ్యాలో తనకేం అర్థంకాదు. ఈ మనిషితో ఇట్లాగే జీవితమంతా గడపవలసిందే — అని నిట్టూర్చాడాయన. ఇంకా కాస్సేపు ఆయన అట్లాగే ఆలోచించి, వానమాట ఎట్లా వుందని అరుగు మీదనుంచి చేతిని ఓసారి ముందుకు చాచాడు. చెయ్యి తడిసినట్టులేదు. కనకంగారు పరధ్యానం నుంచి తేరుకుని కళ్ళు బాగా పెద్దవిచేసి చూడగా—ఫెళ్ళుమని ఎండ కనుపిస్తున్నది. 'ఈ వాన ఎప్పుడో ఆగిపోవడం, ఎండ రావడం కూడా జరిగిపోయాయన్నమాట— అదిగో, దాని ధ్యాసలో పడితే నాకూ పరధ్యానమే' అన్నాడు అరుగు దిగుతూ.

కనకంగారు ఏదో చిన్న మీటింగు వుంటే బయల్దేరాడు. దారిలో ఈ అవాంతరం వచ్చింది. మీటింగు ప్రారంభమే అయిపోయిందో, లేక అయిపోయిందో అనుకున్నాడు. టైమెంతయిందో చూసుకున్నాడు. 'ఛ ఛ—నా భార్య విషయం ఆలోచిస్తే చాలు—అన్నీ మరిచిపోతాను' అని తిట్టుకున్నాడు.

మరో పావుగంటలో కనకంగారు మీటింగు ప్రదేశానికి చేరుకున్నాడు. ఆర్గనైజర్లు హడావిడిగా తిరుగుతున్నారు తప్ప—మీటింగు కనిపించలేదు! 'ఈ వర్షం నాప్రాణం తీసింది. ఇంకేముంది అంతా ఐపోయింది— బల్లలూ, కుర్చీలూ లాగేస్తున్నారు. అని వెనక్కు తిరిగి 'బ్యాడ్జిమనిషి' ఒకడు కనిపిస్తే 'ఎంతసేపయిందండీ మీటింగయిపోయి?' అని అడిగాడు కంగారుగా. 'అయిపోవడమేమిటండీ ఇంకా ప్రారంభంకాందే. మీటింగు ఆరు గంటలకు — యిప్పుడింకా నాలుక్కూడా కాలేదుగా' అన్నాడు బ్యాడ్జీమనిషి. మరోసారి కంగారు పడుతూ కనకంగారు నాలిక కరుచు కరుచుకుని, 'పొరపాటుగా చూసి వుంటానండీ టయిమూ' అన్నాడు. బ్యాడ్జీమనిషి వినిపించుకోలేదు—అతని కంగారులో అతను ఆరుమైళ్ళదూరం వెళ్ళిపోయాడు.

కనకంగారు అయితే అయిందని వెనక సీట్లకుపోయి అక్కడ కూచు






న్నాడు. ఇప్పుడు మళ్ళా వెనక్కు పోవటం ఏమిటిలెమ్మనుకున్నాడు. ఎదురుగా చూసి- 'ఓహో, బల్లలూ కుర్చీలూ వేస్తున్నారా - లాగేస్తున్నారనుకున్నాను, నయమే!' అనుకున్నాడు. ఇంకా రెండుగంటలసేపు ఇక్కడ ఒంటరిగా కూచోవాలి కాబోలు, ఎవరూ తోడైనాలేరు...

వేదిక దగ్గరగా ఎవరో ఒక మగాయనా, ఆడావిడా మాట్లాడుకుంటున్నట్టుగా కనకంగారు కళ్ళజోళ్ళొంచి కనిపెట్టి, అక్కడికిపోతే కాస్త కాలక్షేపం అవుతుందని బయల్దేరాడు. కనకంగారు అక్కడికివచ్చేసరికి, ఆవిడమాత్రం ఒక్కర్తే కూచుని వుంది. మగాయన ఆర్గనైజరులా వున్నాడు - హడావిడిగా ఎటో వెళ్ళిపోయాడు. ఆమె నలభైఏళ్ళ మనిషిలా వుంది. ఐతేనేం అందంగా ముస్తాబై దబ్బపండలేవుంది. కనకంగారికి మంచి కాలక్షేపం అనిపించి ఆమె పక్కగా రెండుకుర్చీల అవతల కూర్చుని మీసం ఓసారి సరిదేనుకుని, కళ్ళజోడు తీసి ఓసారి తుడిచి,

మళ్ళీ తగిలించుకుని – తడిసిపోయి, ఎండుతున్న చొక్కాను ఓసారి సర్దుకుని ఆమెకేసి ఓరగా చూశాడు. ఆమె ఎటో చూస్తూ కనకంగారిని గమనించలేదు. శబ్దం చెయ్యాలని, రాని దగ్గు ఒకటి దగ్గాడు. ఆమె చూసింది–మరో నాలుగుదగ్గులయ్యాక.

'మీరు ఆర్గనైజరాండీ?' అన్నాడు కనకంగారు ఆమెకేసి చూస్తూ.

"కాదండీ మీటింగుకోసం వచ్చాను" అన్నది.

కనకంగారు నవ్వి–"నేనూ దాని కోసమే వచ్చాలెండి. టైము జ్ఞాపకం లేదు. దానికి తోడు వర్షం కూడా వచ్చింది. శుభ్రంగా తడిసిపోయాను పాపం" అన్నాడు నవ్వుతూనే.

"పొడిగుడ్డలు వేసుకుని రావలసింది!" అన్నదామె.

"నిజమే, కాని మళ్ళా ఎక్కడ పోతానండీ–అందుకనే కూచున్నాను. ఇంకా స్పీపటికి ఆరిపోతాయి."

'దీపాలా?' అందామె.

"కాదండీ గుడ్డలు" అని గొల్లున అరగంట నవ్వాడు కనకంగారు, ఆమె జోకు వేసిందని!

"మీటింగు ఆరు గంటలకని ఆహ్వానం అందిందనుకోండి. ఏదీ— మనకు లక్ష వ్యాపకాలు. పోనీ, మా ఆవిడ జ్ఞాపకంచేసి చెబుతుందేమో అనుకొంటే — ఆమె ఉత్త మతిమరుపు మనిషి. ఆహ్వానం వచ్చినట్టు కూడా తెలిసో లేదో ఆమెకు" అన్నాడు కనకంగారు.

"మతిమరుపే! ఎలా కాలక్షేపం చేస్తున్నారు బాబూ ఆవిడతో—" అందావిడ చిరాగ్గా.

"ఎలా అంటారేమిటి–చస్తున్నాను. ఏదీ — ఏదీ గుర్తుండదండీ—ఎన్ని మందులు, ఎంతమంది డాక్టర్లు—"

"సరిగ్గా నాఖర్మకూడా అదేనండీ. మా వారికికూడా మతిమరుపు జబ్బే". కనకంగారు ఏదో దొరికినట్టుగా లేచి, ఆమెకు మరికాస్త దగ్గరగా వెళ్ళి కూచుని — "ఏమిటి ఏమిటి– మీరూ పడుతున్నారూ ఈ అవస్థ?" అన్నాడు నవ్వుతూ.

"మా ఆయన సంగతి అడక్కండి. ఆయనగారికంటె మీ ఆవిడగారు నయమనిపిస్తారు. ఆఫీసుకు వెళతానని పార్కులోకి వెళ్ళి కూచుంటారు. అర్ధరాత్రి వేళ లేచి ఆఫీసుకుపోవాలని బయల్దేరుతారు. బజారువెళ్ళి కూరగాయలు తీసుకురమ్మంటే – పక్కింటికి వెళ్ళి పేకదస్తాలు తీసుకొస్తారు. చచ్చిపోతున్నాను. ఏదీ గుర్తుండదు. ఏదీ జ్ఞాపకం వుండదు" అన్నదామె చిరాగ్గా.

"సరిగా నా యిల్లాలూ అంతే. విడాకు లిచ్చేసి ఇంకెవర్నయినా చేసుకుందామా అనిపిస్తుంది" అన్నాడాయన.

"నాకూ అలాగే అనిపిస్తుందండీ- చెప్పొద్దూ" అన్న దామె.

కనకంగారు తమాషాగా నవ్వి— "జోకుకు అంటున్నాను సుమండీ— ఇలా మీరు మీ వారికీ, నేను మా ఆవిడకు విడాకులు ఇచ్చేసిన తర్వాత వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకోవాలిట!"

"ఇహ చూడాలి కాపురం" అని ఆమె కూడా గొల్లున నవ్వింది. కనకంగారు తన జోకు బాగా పేలినందుకు, ఇంకా నవ్వాడు.

"మతిమరుపు, మనిషిని ఎలా మార్చేస్తుందనుకున్నారు? అది వుండకూడదండీ" అన్నాడు కనకంగారు.

"మా ఆయనగారి బాధలు పడలేకే నేను ఈ మీటింగులుకనీ, వాటికనీ వచ్చేస్తూ వుంటాను."

"చస్తాము మరి"

"ఆరింటికి మీటింగుందని ఆయనతో చెప్పాను. అలాగే అన్నారు. వస్తారు—ఏ ఎనిమిది గంటలకో!" అని నవ్విందామె.

"ఎంత బావుందీ నవ్వు" అనుకున్నాడు కనకంగారు– తన భార్యకు విడాకులిచ్చేసి – ఈమెచేత ఆమె భర్తకూ ఇప్పించేస్తే – తనూ ఈమే... ఓహ్! కనకంగారి గుండె 'ఝల్లు'మని కంగారుగా కొట్టుకుంది. అయినా ఆ 'ఝల్లు' తియ్యగావుంది! ఆ ధ్యాసలోపడి, ఇటుతిరిగి చూసేసరికి అక్కడ కనిపించలేదు. కంగారుగా అటూ ఇటూ చూశాడు, ఆర్గనైజర్ల హడావిడి తప్ప ఇంకేంలేదు– సరే వస్తుందిలెమ్మనుకుని– ధీమాగా కుర్చీలో చతికిలబడ్డారు కనకంగారు.

కాస్సేపటికి ఆర్గనైజరు ఒకడు కంగారుపడుతూ వచ్చి – "సార్ – మీతో యింతసేపూ మాట్లాడుతున్న కామేశ్వరమ్మగారుఎటు వెళ్ళారండీ?" అని అడిగాడు.

"నేను చూడలేదండీ – ఏం?" అన్నాడు ఇంకా కంగారుగా కనకంగారు.

"ఏంలేదులెండి– ఎటు వెళ్ళారోనని– అసలే ఆ కామేశ్వరమ్మగారు మతిమరుపు మనిషి" అంటూ వెతకడానికి కంగారుగా బయల్దేరాడు ఆర్గనైజరు.

"కామేశ్వరమ్మా!" అని కనకంగారు తపీమని లేచి గట్టిగా ఓ కేక పెట్టాడు — "ఐతే ఆమె నా భార్యేనన్మా!"

□□□

---

● సింగిల్ టీచర్ స్కూల్ మాష్టారొకరికి భార్య పోవటంతో చాలా దిగులు పడి పై అధికారికి ఇలా సెలవుచీటీ వ్రాసి పంపాట్ట.

"అయ్యా! మా ఆవిడ హఠాన్మరణంవల్ల నాకు నెల రోజులు సెలవిప్పించ గోరుతున్నాను. మీరు ఈలోగా ఇంకెవర్నయినా పంపి ఈ లోటు భర్తీ చేస్తారని విశ్వసిస్తున్నాను."